# మా గోపీకి నా నివాళి

పి. మాధవి*

**1975** ఎమర్జెన్సీకి కొన్ని నెలల ముందు నేను బి.కాం చివరి సంవత్సరం చదువుతున్నాను. వివిధ కళాశాలల్లో జరిగే వక్తృత్వ పోటీలలో, విద్యార్థి కార్యకలాపాలలో చురుకుగా పాల్గొనే దాన్ని. ఈ క్రమంలో కొందరు విద్యార్థినులం కలసి కొంత వేడి చర్చ తరువాత, ప్రగతిశీల మహిళా సంఘం (POW) ను స్థాపించాము. నేను వ్యవస్థాపక సభ్యురాలిగా, జాయింట్ సెక్రెటరీగా ఎన్నుకోబడ్డాను. కె. లలిత, గీతారామస్వామి, రుక్మిణి మోహన్, సుమిత్ సిద్ధు ఇంకా చాలామంది ఉన్నాము. పిఓడబ్ల్యూ తొలి రోజులలో వరకట్నానికి వ్యతిరేకంగా రకరకాల కార్యక్రమాలు చేపట్టాము. ధరల పెరుగుదలకు వ్యతిరేకంగా ర్యాలీ తీసాము. బాలగోపాల్ అప్పుడు ఆర్ఇసి లో చదువుతూ ఉండేవాడు. ఒకసారి సెలవులకు వచ్చినప్పుడు పిఓడబ్ల్యూ గురించి చెప్పి, మా ఆశయాలు, చేపట్టిన కార్యక్రమాలు వివరించాను. అప్పుడు తన కళ్ళల్లో కనిపించిన అప్రూవల్ నేను ఎప్పటికీ మరచిపోలేను. కొండంత ధైర్యం. నేను సరైన మార్గంలో వెడుతున్నాను అనే విశ్వాసం, భవిష్యత్తుపైన నమ్మకం కలిగాయి. ఎమర్జెన్సీ ప్రకటించాక పిఓడబ్ల్యూ నిషేధించబడింది. మాలో కొందరు అరెస్ట్ అయ్యారు.

ఆ విధంగా నా ఏక్టివిస్ట్ కెరియర్‌కు పెద్ద బ్రేక్ పడింది. అయితే, ప్రజాస్వామ్య ఉద్యమంలో ఉండాలనే నా ఆకాంక్ష మాత్రం బెదరలేదు. ఈ కోరికే కాలక్రమేణా బాలగోపాల్‌తో కలిసి పనిచేయాలి అనే బలమైన కోరికగా మాత్రమే మారింది. 1975లో ఉన్నది ఆవేశం, ఏదో చేయాలనే తపన, చేయగలమనే నమ్మకం, ఒక సిద్ధాంతంగానీ, తాత్త్విక అవగాహనా బలంగానీ లేవు. అవసరమని కూడ

* మానవహక్కుల వేదిక హైదరాబాద్ జిల్లా అధ్యక్షురాలు

అనిపించలేదు. ఈ పరిస్థితినుంచి వ్యక్తిగత జీవితంలో చాలా దూరం వెళ్ళిపోయాను. పూర్తి విరుద్ధమైన ప్రపంచంలోకి వెళ్ళిపోయానని చెప్పక తప్పదు. బాలగోపాల్ నా అంతరాత్మ ప్రబోధకుడు కాకపోయి ఉంటే, బహుశా నేను నేనుగా మిగిలి ఉండేదాన్ని కాదేమో. ఆ సమయంలో అడపాదడపా తనతో మాట్లాడటం, తను మాట్లాడే సభలకు వెళ్ళటం, రాసింది చదవడం వలన, తను ఏ మార్గంలో వెళ్తున్నాడో కొద్దో గొప్పో తెలుస్తుండేది. పూర్తిగా అర్థం కాకపోయినా నేను అనుసరించదగ్గ మార్గమేననే నమ్మకం ఉండేది.

ఎపిసిఎల్‌సిలో ఉన్నప్పుడు తనని గురించి చాలా ఆందోళన చెందిన సందర్భాలున్నాయి. తన క్షేమం గురించిన ఆందోళనే తప్ప, తను ఎంపిక చేసుకున్న మార్గంపైన అవిశ్వాసం లేదు. ఎపిసిఎల్‌సిలో అభిప్రాయ భేదాలు వచ్చి బాలగోపాల్, మరికొందరు బయటికి వచ్చారని తెలిసిన రోజు నేను చాలా దు:ఖించాను. ఎందుకో తెలుసా? తనకు ఆ ప్రక్రియ ఎంత బాధ కలిగించి ఉంటుందో అని. తన ఆత్మ విశ్వాసానికి, సిద్ధాంతం పట్ల ఉన్న స్పష్టతకు జోహార్లు అనుకోకుండ ఉండలేకపోయాను. అయినా ఎన్నో సంవత్సరాలపాటు ఈ విషయాన్ని తన దగ్గర ఎప్పుడూ ప్రస్తావించలేదు. రెండేళ్ళ క్రితం మేమిద్దరం పోలవరం ప్రాజెక్టు వ్యతిరేక సభలో పాల్గొనడానికి బస్సులో వెళుతున్నప్పుడు సందేహిస్తూనే అడిగాను "మీరందరూ ఎపిసిఎల్‌సి నుంచి ఎందుకు బయటకు వచ్చారు? ఏ విషయం మీద మీకు బేధాభిప్రాయాలు వచ్చాయి అని"? తాను ఎపిసిఎల్‌సిలో చేరటం దగ్గర మొదలుపెట్టి మానవ హక్కుల వేదిక పెట్టుకునే వరకు జరిగిన పరిణామాలు, ఎపిసిఎల్‌సిలో తన పాత్ర, తనలో తలయెత్తిన ప్రశ్నలకు మార్క్సిజంలో సంతృప్తికరమైన సమాధానాలు దొరకక పోవటం, హింస పట్ల తన వ్యతిరేకత, పౌరహక్కుల పరిధినుంచి మానవహక్కుల అవగాహనకు తన ప్రయాణం లాంటి ఎన్నో విషయాలు చెప్పుకుంటూ పోయాడు. ఎన్నో సత్యాలు ఇందులో ఆవిష్కరించబడ్డాయి అనిపించింది. నా జీవితంలో బాలగోపాల్‌తో ఇంత లోతైన సంభాషణ ఎప్పుడూ చేయలేదు, ఇక చేసే అవకాశమూ లేదు. ఇవి తెలుసుకోదగినంత ఎదిగానని బాలగోపాల్ భావించినందుకు గర్వపడ్డాను. ఆ నమ్మకం ఎప్పటికీ నిలబెట్టే ప్రయత్నం చేస్తాను.

2003 మేలో హెచ్‌ఆర్‌ఎఫ్ మరికొన్ని హక్కుల సంఘాల సభ్యులతో కలిసి చేసిన కాశ్మీర్ పర్యటనలో నేనూ ఉన్నాను. మానవ హక్కుల వేదిక పనితీరు, నిజనిర్ధారణ చేయడంలో పరిగణనలోకి తీసుకునే విషయాలు, కాశ్మీరు గురించి బాలగోపాల్‌కు ఉన్న లోతైన అవగాహన, ఇలా చాలా విషయాలు తెలిసాయి. ఆ తరువాత క్రమ క్రమంగా హెచ్‌ఆర్‌ఎఫ్ కార్యకలాపాలలో పాల్గొంటూ మానవహక్కులు అనే అంశాన్ని ఎంత విస్తృతమైన అర్థంలో చూడవచ్చో తెలుసుకున్నాను.

## ఆదివాసులకు చేయమనేవాడు

'నీకు ఏవర్గం కోసమైనా పనిచేయాలి అనిపిస్తే, ఆదివాసుల కోసం పనిచేయి. వాళ్ళకు ఎంత చేసినా ఇంకా చాలా సమస్యలుంటాయి... అన్నాడు బాలగోపాల్ ఒకసారి. ఆ స్ఫూర్తితోనే ఆదివాసీ మహిళల గురించి ఒక ప్రాజెక్టు చేసే అవకాశం వచ్చినప్పుడు వదులుకోలేకపోయాను. ఆదివాసుల పట్ల అప్పుడు మొదలైన ఆసక్తి కొనసాగుతూ, వచ్చిన అవకాశాలను వాడుకుంటూ, అవగాహన పెంచుకుంటూ నేను కూడ హక్కుల కార్యకర్త కాగలను అనే నమ్మకం నాపైన నాకు కలగడానికి ఇంత కాలం పట్టింది. ఎప్పుడు ఏ సందేహం వచ్చినా ఏ విషయంలో స్పష్టత అవసరమైనా ఒక ఫోన్‌కాల్ చేస్తే, నిమషాలమీద ఆ సందేహాన్ని తీర్చేవాడు బాలగోపాల్. ఇటీవలి కాలంలో మా మధ్య అన్నా చెల్లెళ్ళ సంబంధం కంటే హక్కుల ఉద్యమంలో భాగస్వాములు, సహచరులుగా ఉండే సంబంధమే ఎక్కువగా ఉండేది.

కలిసి పనిచేస్తున్న క్రమంలో ఎప్పటికప్పుడు ఆశ్చర్యపోయే పరిస్థితి వచ్చేది. ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాలలో ఓపెన్‌కాస్ట్ గనులను వ్యతిరేకిస్తూ 2008 నవంబర్ నెలలో వరసగా చేపట్టిన పాద యాత్రలు, ప్రచార యాత్రలు నాకు చాలా నేర్పాయి. గ్రామాలలో బాలగోపాల్ మైక్ పట్టుకుని, చెప్పిన స్లోగన్ చెప్పకుండా, గొంతెత్తి పిలుపునిస్తూ, ఓపెన్‌కాస్ట్ వలన వచ్చే ప్రమాదాలివి అని చెప్తూ, "మీతో మేము కలిసి వస్తాం, వీటిని ప్రతిఘటిద్దాము" అని గ్రామ గ్రామంలో కాలినడకన తిరుగుతూ, గ్రామస్తులను పోగేసి వాళ్ళతో మాట్లాడుతూ, గ్రామ కమిటీలు వేస్తూ, ముందుకు పోతూ... అది ఎప్పటికీ మరువలేని అనుభవం. గ్రామస్తులతో పాటు మేము కూడా, తను మాతో ఉంటాడనే అనుకున్నాము. ఆ అనుభవంతోనే ఇప్పుడు నేను మిగిలిన హెచ్‌ఆర్‌ఎఫ్ కార్యకర్తలతో కలిసి ఓపెన్‌కాస్ట్ ప్రజాభిప్రాయ సేకరణలలో పాల్గొనగలుగుతున్నాను. ఏ విషయాన్నైనా హక్కుల దృక్కోణంలో అవగాహన చేసుకుని, అందులో నా కర్తవ్యాన్ని నిర్దేశించుకోగలుగుతున్నాను. గ్రామాలలోకి వెళ్ళినప్పుడు మీ సమస్య మాకర్థమైంది, మేము మీతో ఉంటాము అనే విశ్వాసాన్ని వాళ్లలో కలిగించగలుగుతున్నాను.

సాంప్రదాయకమైన కుటుంబంలో బతుకుతూ చాలాకాలం పరిమితమైన పరిధిలోనే ఉన్నా ఆలోచన ఎప్పుడూ ఇరుకులో మగ్గలేదు. ఇంతకంటే అర్థవంతమైన ప్రయోజనం జీవితానికి ఉంది. అది ఏదో ఒక రోజు ఆవిష్కరించుకోగలుగుతాను అనే నమ్మకం ఉండేది. హక్కుల కార్యకర్త కాకముందు, నిరంతరం సంఘర్షణకు లోనయ్యాను. దాని నుంచి నన్ను బయటపడేసి నాకు కర్తవ్యం నిర్దేశించింది బాలగోపాల్. 'మనం మన పని చేసుకుంటూ పోదాం. ఎవరి సంస్కారాన్ని బట్టి,

అవగాహనను బట్టి, రాజకీయ భావజాలాలను బట్టి, పక్షపాతాలను బట్టి వాళ్లు అర్థం చేసుకుంటారు. ఎప్పుడూ సంజాయిషీలతో కాలం వ్యర్థం చేసుకోకూడదు' అనే తన రూలు హెచ్ఆర్ఎఫ్‌కు ఏవిధంగా వర్తిస్తుందో వ్యక్తిగతంగా నాకు కూడ అదే విధంగా వర్తిస్తుందనుకున్నాను.

ఏమీ తెలియని అమాయకత్వంలో, ఆవేశంలో పిఓడబ్ల్యూతో ప్రారంభమైన ఈ కర్తవ్యం కొంత దూరం ప్రయాణం చేసి, ఆగిపోయి, నిర్జీవమై మళ్ళీ సజీవమై కొనసాగే ప్రయత్నంలో ఉందంటే దానికి తనే కారణం. 1999లో మా అబ్బాయికి ఉపనయనం చేస్తూ బాలగోపాల్‌ను ఆహ్వానించినప్పుడు 'నువ్వు బుద్ధిలేక చేస్తున్న పనికి నన్ను కూడ ఎందుకు రమ్మంటున్నావు' అనే తన వ్యాఖ్య నన్ను ఉలిక్కిపడేటట్లు చేసింది. జీవితంలో ఏ స్థాయి హిపోక్రసీకి నేను బలైపోతున్నానో అర్థమైంది.

బాలగోపాల్ నుంచి ఎంత తెలుసుకున్నానో, ఎంత తెలుసుకోవాల్సి ఉందో, ఎంత తెలియటానికి అవకాశం లేదో, అంచనా కూడ లేదు. మిగిలింది తను ఇచ్చిన స్ఫూర్తి. ఆ స్ఫూర్తితో తన బాటలో ప్రయాణించటం కంటే నేను చేయగలిగింది కానీ, ఇవ్వగలిగిన నివాళిగానీ ఏమీ లేదు.